కోర్కెలు తీర్చే నాగోబా

- నేటి నుంచి మూడురోజులు పూజలు
- ముస్తాబైన ఆలయం..ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న భక్తజనం



నాగోబా దేవాలయం

కెరమెరి: మండలంలోని కరంజివాడ గ్రామ పంచాయతీ పెద్ద కరంజివాడ గ్రామంలో కోరిన కోర్కెలు తీర్చే నాగోబా పూజకు వేళ అయింది. శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే పూజకు ఆలయం ముస్తాబైంది. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామపటేల్, పుజారి కుంరం బొజ్జు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 29 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న పూజలకు 200 గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి పూజలు చేస్తారు.

ఇది చరిత్ర

1995వ సంవత్సరం పెద్ద కరంజివాడ గ్రామంలో కుంరం బొజ్జు ఇంటి వరండాలో కూర్చొని మహిళలు కంది పల్లీలు తెంపుతుండగా అకస్మాత్తుగా నాగుపాము ప్రత్యక్షమైంది. దాన్ని చంపేందుకు ప్రయత్నించిన దొరకలేదు. చివరికి ఎక్కడైతే కనిపించిందో అక్కడే యువకులు కర్రలతో కొట్టి చంపారు. అదేరాత్రి కొట్టంలో ఉన్న 40 మేకలు హఠాత్తుగా మరణించాయి. గేదెలు, ఆవులు అనారోగ్యం కావడంతో గ్రామపటేల్ నాగోబాకు మొక్కారు. నీదే మహిమ అయితే మా పశువులను ఆరోగ్యవంతులుగా చేయాలి. అలా చేస్తే ×నా ఇంట్లోనే పుట్ట ఏర్పాటు చేసి ప్రతీఏటా మొక్కు తీర్చుకుంటాం౯తప్పు జరిగితే క్షమించమని గ్రామపటేల్ బొజ్జు వేడుకున్నాడు. తెల్లారేసరికి పశువులన్నీ ఆరోగ్యంగా మారడంతో ఇది దేవుని మహిమ అని తెలుసుకున్న బొజ్జు తన ఇంట్లోనే పాముపుట్ట తయారుచేసి పూజ నిర్వహించడంతో నాగోబా ప్రత్యక్షమైంది. అప్పటి నుంచి ప్రతీఏటా భక్తశ్రద్ధలతో నిర్వహించే పూజలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక మహారాష్ట్రకు చెందిన భక్తులు తరలివస్తున్నారు.



నాగోబా, నంది ఇతర దేవతల ప్రతిమలు



నాగోబా ఆభరణాలు

భక్తుల విశ్వాసం

నాగోబాను పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, ఆపదలో ఉన్న వారి కష్టాలు దూరమవుతాయని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని వారి నమ్మకం. జిల్లా నుంచే కాక మహారాష్ట్రలోని భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజించాలి



నాగోబా దేవతకు ప్రత్యేక పూజలు చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అన్ని కోర్కెలు నెరవేరుతాయి. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. – కుమురం బొజ్జు పటేల్, పూజారి

గంగనీటి కోసం పాదయాత్ర



కెరమెరి మండలంలోని పెద్ద కరంజివాడలో ప్రారంభమయ్యే నాగదేవత పూజకు పవిత్రమైన గంగానది నుంచి పవిత్ర జలాలను మహిళలు గురువారం తీసుకువచ్చారు. గ్రామాలకు చెందిన మహిళలు పాదయాత్రగా వెళ్లి గంగాజలాన్ని బిందెల్లో తీసుకువచ్చి సాయంత్రం మట్టిని చేతులతో కలిపి పాముపుట్టను తయారు చేశారు. శుక్రవారం ఉదయం పాముల పుట్ట వద్ద పాలు పోస్తారు. పుట్నాలు వేసి తమ మొక్కు తీర్చుకుంటారు.

ఇంటింటికీ 'భగీరథ' నీరందించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జైనూర్: ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందిరంచాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలంలోని దబోలి గ్రామంలో గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. భగీరథ పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేపట్టి ప్రతి కుటుంబానికి మంచి నీరు అందించాలన్నారు. ఎంపీడీవో ప్రభుదయ, కార్యదర్శి ఉదయ్‌రామ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారి పి.సురేష్‌బాబు అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సిర్పూర్(టి), పారిగాం, లోనవెల్లి, డోర్‌పల్లి, కర్జపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈవో కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అధికారులకు సహకరించాలి

కెరమెరి: గృహజ్యోతి పథకానికి విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగానికి పలు ధ్రువపత్రాలు అందించాలని పేర్కొన్నారు. ఆహార భద్రతా కార్డు నెంబరు, ప్రజాపాలన దరఖాస్తు రసీదును సిబ్బంది అడిగితే ఇవ్వాలని సూచించారు.

రెబ్బెన: ఉచిత 200 యూనిట్ల విద్యుత్ వినియోగానికి వినియోగదారులు సిబ్బందికి సరైన ధ్రువపత్రాలు అందించాలని రెబ్బెన ఏఈ ఇమ్రాన్ ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బందికి ఇంటికి వచ్చిన సమయంలో లబ్ధిదారులు పలు వివరాలు, ధ్రువపత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

జైనూర్: గృహలక్ష్మికి సంబంధించి దరఖాస్తుల ధ్రువీకరణ పత్రాలను అధికారులకు ప్రజలు సహకరించాలని ఏఈ సాదిక్‌మియా పేర్కొన్నారు.

ఆసిఫాబాద్: విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి ప్రజాపాలనలో సమర్పించిన వివరాలు, రశీదు అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన రసీదు, ఆహారభద్రత కార్డు, ఆధార్ కార్డు వివరాలను స్పాట్ బిల్లింగ్ కోసం వచ్చిన సిబ్బందికి ఇవ్వాలన్నారు.

గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్రగ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. సిర్పూర్(టి) నియోజకవర్గం మారుమూల ప్రాంతం కావడంతో అధికశాతం నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి




మాట్లాడుతున్న తిరుపతి

రెబ్బెన: ఏఐటీయూసీకి గుర్తింపు సంఘం హోదా కల్పించిన కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గురువారం గోలేటి సీహెచ్‌పీ జనరల్ బాడీ సమావేశాన్ని గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పొందుపర్చిన 49 అంశాలను దశలవారీగా సాధిస్తామన్నారు. అదే తరహాలో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, శివరావు, కిరణ్‌బాబు, రాజేష్, చంద్రశేఖర్, ఆనంద్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీ నూతన కమిటీ..

గోలేటి సీహెచ్‌పీ ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శిగా ఎంబడి రామయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఏరిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా అమర్‌సింగ్, బీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా చంద్రయ్య, సీ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా కుసుమ శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా ఎండీ ఆదం సమీ, మైన్స్ కమిటీ సేఫ్టీ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గాండ్ల తేలి కులస్తుల సంక్షేమానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గాండ్ల తేలి కులస్తుల సంక్షేమానికి కృషిచేయాలని సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన అఖిల గాండ్ల తేలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐక్యత-అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 10 వేల పైచిలుకు బడి జనాభా ఉన్న గాండ్ల తేలి కులస్తులను అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు తుకారాం, రవీందర్, ఉద్ధవ్, శ్రవణ్, సురేశ్, ఆనంద్‌రావ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమావేశం

రెబ్బెన(ఆసిఫాబాద్): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని భాస్కర భవన్‌లో శుక్రవారం సింగరేణి ప్రైవేటు ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి తెలిపారు. గురువారం కైరిగూడ ఓసీపీ ఓబీ పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో కలిసి గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రైవేటు ఓబీ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాల కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఓబీ కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అద్దెవాహనాల దరఖాస్తు గడువు పొడిగింపు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో యూనిట్ రేట్ ప్రకారం అద్దె ప్రతిపాదికన ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తుల స్వీకరించేందుకు గడువు తేదీ పొడిగించినట్లు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఉపరితల గనుల్లో నడిచే వాహనాలకు కొత్త రేట్లు వర్తించనున్నందున దరఖాస్తు గడువు తేదీని ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొంది. భూ నిర్వాసితులకు ప్రాధాన్యత ఉంటుందని, వివరాలకు పర్చేస్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలని తెలిపింది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సెయింట్ మ్యారీ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అత్యపత్య పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి మహారాష్ట్రలోని సెవగ్రాంలో ఈనెల 11న నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పీఈటీ రాకేశ్, కిరణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల్లో గాంధీనగర్-2

- అంతర్గత రోడ్లు, వీధి దీపాలు లేవు
- ఇబ్బందులో ప్రజలు



బురదగా మారిన రోడ్డు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఎన్‌జీఓఎస్ కాలనీ గ్రామ పంచాయతీలోని గాంధీనగర్-2 కాలనీలో సమస్యలు పేరుకుపోయాయి. ఈ కాలనీలో సుమారు 300 మంది జనాభా ఉంటుంది. అంతర్గత రోడ్లు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో దారి బురదగా మారుతుండటంతో కాలినడకన వెళ్లలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులు రోడ్డు వేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారేగాని రోడ్డు నిర్మించడం లేదని వారు వాపోతున్నారు. కాగజ్‌నగర్ పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఈ కాలనీపట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తుండటం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

మురుగుకాల్వలు లేవు

కాలనీలో మురుగుకాల్వలు లేవు. మురుగునీటి గుంతలు ఏర్పడి దోమలు వ్యాపిస్తుండడంతో రోగాల బారినపడుతున్నారు. కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఉండటంతో నీరంతా రోడ్లపై పారుతోంది. దీంతో రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు



రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వానాకాలంలో బురదరోడ్డులో నడవలేక జారి పడిపోతున్నాం. మురుగుకాల్వలు నిర్మించాలి. మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ ఉండటంతో నీరంతా వృథాగా పోతోంది. – సిద్దార్థ, గాంధీనగర్-2

చర్యలు తీసుకుంటాం

కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం. వీధి దీపాలు ఏర్పాటు చేసేలా కార్యదర్శిని ఆదేశిస్తాం. భగీరథ పైపులైను లీకేజీలను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ గౌడ్, ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

అడవులకు నష్టం చేస్తే ఉపేక్షించం

లింగాపూర్: అడవులతోపాటు వన్యప్రాణులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదని జోడేఘాట్ ఇన్‌చార్జి రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. మండలంలోని నిమ్మతండా, పిక్లానాయక్‌తండా, వంజారిగూడ, మామిడిపల్లి, లింగాపూర్, మహగావ్ తదితర గ్రామాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. రూ.40 వేల విలువైన 8 టేకు దుంగలు, 4 కర్రకోత యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల నుంచి కలప తరలించినా..వన్యప్రాణులను వేటాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. కెరమెరి, ఆసిఫాబాద్ ఎఫ్ఆర్వోలు మజారొద్దీన్, అప్పలకొండ, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: ప్రతిఒక్కరూ బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ రీజినల్ మేనేజర్ మురళీమనోహర్ కోరారు. పీఎం జీవనజ్యోతి బీమా యోజన లబ్ధిదారులకు గురువారం కౌటాల టీజీబీలో రూ.2 లక్షల చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీమా చేసుకోవాలని, ఆర్థిక అక్షరాస్యత సాధించాలన్నారు. బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి, అజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం

కాగజ్‌నగర్‌రూరల్: లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని మహిళా సాధికారత కేంద్రం జండర్ స్పెషలిస్టు రాణి అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్, మారుతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ పథకాలు, చట్టాలపై మహిళలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో, సుకన్య సమృద్ధి యోజన పథకాల గురించి వివరించారు. ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షత రూపుమాపాలంటే తల్లిదండ్రులకు అవగాహన అవసరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు మంగ, విజయలక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుష్ఠుపై అవగాహన

వాంకిడి: మండల కేంద్రంలోని సాయి గోపాల పాఠశాలలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాధి అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. హెచ్ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది క్రిస్టియాన, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

11న గురుకులాల ప్రవేశపరీక్ష

సిర్పూర్(టి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి ఈనెల 11న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లు, ఆధార్‌కార్డులతో సకాలంలో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. జిల్లాలో మొత్తం 9 ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన మాదాసు రజిత ఇంట్లో నిల్వ ఉంచిన 3.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. పక్కా సమాచారంతో తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామన్నారు.

11న వార్షిక క్రీడా దినోత్సవం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో గల సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 11న సాయంత్రం 5.30 గంటలకు సింగరేణి వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90వ వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం రవిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బాల, బాలికలు, అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు క్రీడాపోటీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జిగా ఎంపీడీవోగా మహేందర్

వాంకిడి: వాంకిడి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కెరమెరి ఎంపీడీవో మహేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్‌రెడ్డి గతేడాది బదిలీపై వెళ్లగా ఎంపీవో శివకుమార్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సీఐలు



ఎస్పీకి మొక్క అందజేస్తున్న సీఐలు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్, రెబ్బెన సీఐలుగా బాధ్యతలు స్వీకరించిన జి.సతీశ్, చిట్టిబాబు ఎస్పీ సురేశ్ కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో ఆయనకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సీఐలకు అభినందనలు తెలిపారు.

ఎస్సైల బదిలీలు

ఆసిఫాబాద్: జిల్లాలో పలువురు ఎస్సైలు బదిలీ అయ్యారు. జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైలు ఆర్.వెంకటేశ్వర్, పి.చంద్ర మిస్త్రీ, ఆర్.తిరుమలను రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేయగా..వెయిటింగ్‌లో ఉన్న ఎస్సైలు కె.శ్రీనివాస్, ఎం.సుధాకర్‌రావు, డి.రాజయ్య, ఎస్.ఓబులమ్మను జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్బీఐ సమీపంలో ఈనెల 11న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో గురువారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులు హరిస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సభకు మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ, ఐకేపీ, ఆశవర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు తరలిరావాలని కోరారు. క్రిష్ణమాచారి, మోరేశ్వర్, నాగేశ్, శారద, లక్ష్మి, హైమావతి, జీజాబాయి, జనార్దన్, సునీల్ పాల్గొన్నారు.

కొలాంగూడలో వైద్యశిబిరం



గిరిజనులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామంలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. కొలాం గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యుడు నాగరాజు, టెక్నీషియన్ రాజువర్ధన్, వీటీడీఏ వైస్ ప్రెసిడెంట్ సిడం పగ్గు, గ్రామ పటేల్ సీడం ధర్ము, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపాలి



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కౌటాల: బడి బయట పిల్లలను పాఠశాలలకు పంపాలని ఎంఈవో డి.సోమయ్య అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్ఎంలు హన్మంతు, నారాయణ్‌సింగ్, జయరాజు, సీఆర్పీలు ప్రకాశ్, మహేశ్, లాలాజీ, దేవన్న, సుమన్, లూలాజీ, తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్ సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

బెజ్జూర్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న మండల కేంద్రాల్లో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్యదర్శి తుమ్మిడే భీమేశ్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో గురువారం టాలెంట్ టెస్ట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 16 లోగా సంబంధిత హెచ్ఎంలు, ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొండ సాయిరామ్, నాయకులు రామగిరి అర్జున్, రాదండి సాయి, క్రాంతి, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.